# ఆచరణ

ఆచంట హైమవతి




“పేద బాపడివి కదా – అని ఏదీ తాకట్టెట్టు కోకుండా అప్పిత్తే... రెణ్ణెల్లై వడ్డీ కూడా ఇచ్చినావు గాదు పంతులూ ! ఇదేం బాలే... సూడు... నేనప్పిచ్చేదే వడ్డీకోసం గదా... ఏటి?” ప్రశ్నార్థకంగా అడుగుతున్న తండ్రి దూకుడు మాటలు వింటూ చాటుగానే ఉండి పోయింది సుగుణ.

మేష్టారికి అర్థం కాలేదు. సింహాద్రికి ఎలా జవాబు చెప్పాలో...! ఆయన తత్తర పడటం నీళ్ళు నమలుతూండటం తెలుస్తూనే ఉన్నా అసహాయురాలైపోయిందామె. ఎంత సంపదున్నా నాన్నకి ఈ డబ్బు పిచ్చి పోదు. ఇది కూడా ఒక విధమైన దరిద్రమే! ఎంతున్నా లేదనుకోవటం, రావలసినది కొంచెం డబ్బే అయినా దేవిరించినట్లు – ఇప్పుడే ఇమ్మని పీకమీద కత్తిలాగ పీడించుకు తినటం.... ఏమిటో... ఇదంతా’’ దిగులుగా నిట్టూరించి సుగుణ.

తండ్రి వెళ్ళిపోయిన తర్వాత లోపలికి వెళ్ళి మేష్టారి భార్య దగ్గర కూచుంది. ఆవిడ జాలిగా జీవంలేని నవ్వు నవ్వి’’ ఎప్పుడొచ్చావ్ అమ్మమ్మ గారి ఊరినుంచి?” అంది.

“నిన్ననే వచ్చానమ్మగారూ” అంటూ ఏవేవో ఊరి విశేషాలు చెప్తూనే “ నేను వీళ్ళకేమైనా సహాయం చెయ్యగలనా ?” ఆలోచించసాగింది.

మేష్టారిది పేద కుటుంబం, పెద్ద కుటుంబం కూడా. స్వంత ఊరిలో ఉన్న తల్లి దండ్రులకీ, ముసలి బామ్మకీ అన్ని అవసరాలూ తీరటానికి మేష్టారే డబ్బు పంపాలి. కొడుకు పట్నం కాలేజీలో చదువుతున్నాడు. అతగాడికీ డబ్బు పంపాలి. భార్య నీరసం మనిషి. ఆమె వైద్యానికీ, నిత్యవసరాలకీ డబ్బు సర్దటం ఎప్పటికప్పుడు నెల..నెల గండమే.

అప్పు చెయ్యకూడదని ఎంత పొదుపుగా నెట్టుకొస్తున్నా అయ్యదగ్గర అప్పు చెయ్యక తప్పలేదు మేష్టారికి. ఆలోచిస్తూ ఇంటివైపు నడుస్తున్న సుగుణకి చటుక్కున ఒక ఉపాయం తోచింది.

తనకి ఆ ఆలోచన తోచినందుకు తనని తానే అభినందించు కుంది. తనకి తోచింది సాధ్యమైనంత త్వరలో ఆచరణలో పెట్టేయాలన్న ఉత్సాహం ఆమెని నిలువనియ్యటం లేదు. ఊపిరి సలపనివ్వటం లేదు.

తల్లి దగ్గర పెద్దగా మారాము పెట్టుక్కూర్చుంది.

తనకి మార్కులు సరిగా రావటం లేదనీ, మేష్టారి దగ్గరికి ప్రైవేటు పెట్టించుకుంటానని నచ్చచెప్పింది. “మీ అయ్యనడుగే” అని తల్లి తప్పించుకుందామనుకున్నా కుదరనివ్వలేదు. తిండి

తినకుండా అలిగి పడుకుంది. "సర్లే మీ అయ్యతోనే చెప్తాలే" అని బతిమాలించుకుని అన్నం తింది. తల్లికి సంగతి వివరించింది.

"పాపం అనిపిచ్చిందమ్మా. మేట్టారి దగ్గ దబ్బుంటే ఎప్పుడో ఇచ్చేసేవోరు. అప్పుంచుకునే మడిసికాదారు. అమ్మగోరు కూడా శానా మనేదగా అవుపించే రమ్మా. సకితే లేదాయమ్మకి" బిక్కమొహంతో చెప్పింది సుగుణ.

కూతురు మాటలకి ఆలోచనలో పడిందామె. తల్లి మౌనాన్ని తనకి అనుకూలంగా మలుచుకుందామనుకుంది సుగుణ "మన పిన్నమ్మోళ్ళూ, మనత్తియ్యోళ్ళూ అలా ఉంటే నువ్వూ - అయ్యా ఊరుకుంటారామ్మా? సాయం సెయ్యరా ? అంద్కే నాకు పెరివేటు సెప్పినందుకయ్యే డబ్బు అప్పుకింద జమేసుకోమని అయ్యకి సెప్పమ్మా... పా..పం"

"నీ కయ్యన్నీ ఎందుకే... నీకా పంతులు కాడ పెరివేటు కావాలంతే గందా'' అందావిడ. సమస్య మళ్ళీ మొదటికొచ్చినట్లని పించింది సుగుణకి.

" అదేం కుదర్దంతే ! నా పెరివేటు సంగతే కాదు. నా జీతం అప్పుకి జమెయ్యాల. అలాయితేనే నేను పెరివేటుకెడతాను. లేపోతే పెయిలై - పోతానంతే.... అంతే!" తన మాట నెగ్గటం లేదనీ, అందుకు తన తల్లి సాయం దొరకటంలేదనే కినుకుతో ముక్కుపుటాలదురు తుండగా అక్కణ్ణుంచి లేచిపోయింది సుగుణ.

" ఏం పిల్లో... ఏటో ! అయ్యో పాపం అంటా ఏదో ఒక లంపటం తెచ్చి పెడద్ది" అని విసుక్కుని " నే సెప్పినా ఆడు నా మాటింటాడా? సూద్దారిలే... ఇంటాడబిడ్డవి. దీపాలేళ అలిగి పొడుకోమాకు" నిట్టూరుస్తూ అంది సుగుణ తల్లి.

మరికొంచెం వాదించికూతురు ప్రైవేటు సంగతి ఒప్పించిందామె. "ఏటేటి?.... బయటి యవ్వారాలన్నీ కూపీ లాగేసి తల్లీ కూతుళ్ళిద్దరూ నా మీద జులుం సెలాయిత్తన్నారేటి?" అని కాస్సేపు కళ్ళెర్రచేసి, కొంచెంసేపు ఎగిరెగిరిపడి, చివరకి మేష్టారి దగ్గర ప్రైవేటుకి ఒప్పుకున్నాడు సింహాద్రి. ఎక్కడైనా ఉగ్రావతారం చూపించగలడు గాని కూతురు విషయం వచ్చేసరికి మెత్తబడిపోతాడు.

★ ★ ★ ★

తన మాట నెగ్గినందుకు ఉప్పొంగిపోయింది సుగుణ. ఆ మర్నాటినుంచే ప్రైవేటుకి మేష్టారింటికి వెళ్ళటం మొదలెట్టింది. చదువు చెప్పించుకోవటంతో బాటు మేష్టారి భార్యకి చాలా సాయం చేసి పెట్టేది సుగుణ.

'' ఈ నెల్లాళ్ళు నాకు పెరివేటు సెప్పినందుకు మేట్టారు కొంత అప్పు తీరిసినట్టు జమేసుకో అయ్యా'' కళ్ళు దించుకుని వినయంగా చెప్పింది సుగుణ.

తల పంకించి బయటకెళ్ళిపోయాడు సింహాద్రి. కొంచెం సంతోషం కలిగినా నమ్మకం కలగలేదామెకు. తనమీద ఇష్టంచేత అయ్యపైకి చెప్పకపోయినా డబ్బు నష్టపోవటానికి ఒప్పు కోడని ఆమెకు తెలుసు.

★ ★ ★ ★

''ఏం పంతులూ... నాకాడ వడ్డీ ఎగ్గొడదామని నా కూతుర్కి పెరివేటు సాకెట్టిచ్చి, సిన్నదాన్ని సేసి రేపెడతావా? మొత్తానికి గట్టోడివేనయ్యా ! నానేమీ ఎర్రోణ్ణనుకో మాకు... నువ్విబ్వాల్సిన వడ్డీ డబ్బులు పెరివేటుకి జమేసుకున్నాని, అప్పు తీర్పోతోందని ఎర్రాసలెట్టుకుంటే మోసపోయేది నువ్వే. నానిచ్చిన పెతీపైసా తిరిగి నాకిచ్చి తీరాల" అంటూ ఇంతెత్తున ఎగిరి వెళ్ళాడు సింహాద్రి.

మేష్టారు మాత్రం కిమ్మనలేదు. తర్వాత రోజున సుగుణకి తెలిసి "ఏమిటి మేష్టారూ... మీరెందుకూరుకున్నారు. విద్యాదానం చేస్తున్నది మీరు. ఎంతిస్తే మీ ఋణం తీరుతుంది? అందరి దగ్గర అంత నెమ్మదిగా ఉండకూడదు మేష్టారు !" వినయంగా చెప్తూ తన తండ్రి పిసినికొట్టుతనానికి బాధపడింది సుగుణ.

"అనువుకాని సమయాన అధికులం అనరాదు. ఒదిగి ఉండటం మంచి లక్షణం సుగుణా...." ఇంకా ఏదో చెప్పబోతున్న మాష్టారిమాటని మధ్యలోనే అందుకుంది సుగుణ.

"నిజమే మేష్టారూ ! మీరు చెప్పినట్లు 'వినయ, విధేయతలు' 'మంచివాళ్ళూ... దయా- దాక్షిణ్యాలు' గల వాళ్ళ దగ్గర పనికొస్తాయి కాని.... ప్రతి సంగతీ తనకి అనుకూలమైన విధంగా మార్చేసుకునేటోల్ల- దగ్గర పనికిరావు." ఆ మాటలు చెప్తూండగానే తన అసహాయతకి దుఃఖం వచ్చేసిందామెకు.

"పేదవాని కోపం పెదవికి చేటు" అనేది పెద్దల సూక్తి. నేను పేదవాడిని సుగుణా" సుగుణను అనునయిస్తూ అన్నారు మేష్టారు.

"అయితే మాత్రం .....?"

"అవసరానికి అప్పు చేసిన మాట వాస్తవం కదా ! అది తీర్చేవరకూ అణిగి ఉండటం కంటే ఏం చెయ్యగలం? గొడవపడి ఏం లాభం? చిన్నపిల్లవి. నీకింకా లోకం పోకడ... లాభ-నష్టాలూ తెలియవు. అందుకని అలా అనుకుంటున్నావు" సన్నగా నవ్వుతూ అన్నారు మేష్టారు.

"లేదు మేష్టారూ. చిన్నదాన్ననే కాదు. పెద్దైన తర్వాత కూడా - నేనిలాగే ఆలోచిస్తాను. నేను మారను మేష్టారూ ! నిజం...!" అంటూ గబుక్కున మేష్టారి చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రమాణం చేసింది సుగుణ.

ఈ హఠాత్సంఘటనకి మేష్టారు అప్రతిభులయ్యారు. తన శిష్యులకి తను మనుష్యత్వాన్ని గురించి చేసిన బోధలు గాలికి పోలేదని అనుకున్నారు. ఆయన నయనాల్లో సన్నటి నీటిపొర కదిలింది.

★ ★ ★ ★

హైస్కూలు చదువు పూర్తవుతూనే సుగుణను చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్న యువకుడితో ఆమె వివాహం జరిగింది.

ఆమె తన పుట్టింటి కంటె కొంచెం సిరిగల ఇంటికే కోడలయింది. అయినా గర్వపడలేదు. అందరికీ తలలో నాలుకైంది. సుగుణ ఆడపడుచు పట్నం కాలేజీలో చదువు

తోంది. చెల్లెల్ని రోజూ పట్నం బస్సెక్కించి, తను పనికి వెడతాడు సుగుణ భర్త. అతడా ఊళ్ళో హైస్కూలు టీచర్. లైబ్రరీ నుంచి పురాణ గ్రంథాలు, సాహిత్య గ్రంథాలు తెచ్చి చదువు తాడు సుగుణ మామగారు. ఎంతో ఇష్టంగా వింటుంది సుగుణ అత్తగారు.

పంతులుగార్కి తానిచ్చిన వాగ్దానం ఎప్పటికప్పుడు జ్ఞాపకం చేసుకుంటూనే ఉంది సుగుణ. తనకంటే పేదవాళ్ళమీద జాలి – దయ అంతకంతకు అధికమవుతూనే ఉంది. తన పరిధిలో ఆమె దీనులకు సహాయం అందిస్తూనే ఉంది. అందుకు ఆమె భర్త కూడా సహకరిస్తూనే ఉన్నాడు.

ఎన్నో ఏళ్ళుగా సుగుణ అత్తారు – దాయాదుల ఆస్తి గురించిన 'కేసు' కోర్టులో నడుస్తోంది. ఆకేసుకి ఇటీవల తీర్పు జరిగింది. వీళ్ళవైపే విజయం కలిగింది. అందరూ 'కోడలొచ్చిన వేళా విశేషం' అనీ, 'కోడలి మంచి తనం' అనీ పొగిడారు. అత్త-మామలూ, భర్త కూడా ఆమె యందు ఆప్యాయం చూపారు.

"మీ వైపు న్యాయం ఉంది. అందుకే గెలుపొందారు. ఇందులో నా విశేషం ఏమీ లేదు". అని సుగుణ ఎంత చెప్పినా వాళ్ళు వినలేదు. ఏదైనా ఆభరణం చేయిస్తామని చాలా పట్టుపట్టారు. ఎవరెంత బలవంత పెట్టినా ఆభరణం చేయించుకోటానికి ఒప్పుకోలేదు సుగుణ.

ఆ రాత్రి ఆమెభర్త తన మీద ఒట్టు పెట్టుకున్నాక, ఇంకాగలేక తన మనస్సులోని పంతులుగారి గాథ చెప్పింది. గురుదక్షిణగా ఆ పంతులు గారి అప్పు తీరితేనే గాని తనకి మనశ్శాంతి లేదని చెప్పింది. ఆ సంగతిలో సంగతిగా తన తండ్రి పిసినిగొట్టుతనం గురించి కూడా క్షుణ్ణంగా చెప్పింది. ఆమె ఆంతర్యాన్ని అతడు పూర్తిగా గ్రహించాడు.

తన ఇష్టసఖి గురుభక్తికి ముగ్ధుడయ్యాడు. మామగారి మనస్తత్వానికి "ఏం చేస్తాం....? కొందరలాగే ఉంటారు. వారి దృష్టిలో అది కరక్టే !" అన్నాడు. కినుకుగా చూసింది సుగుణ.

"సుగుణా! నిజంగా సార్థక నామధేయు రాలివోయ్ ! నీకీ పేరు ఎవరు పెట్టారో గాని...?" కళ్ళనిండా అనురాగం నింపుకుని అన్నాడతను.

"ఎవరు పెడితే ఏం గాని .... మీరు మెచ్చుకున్నారు. అదే పదివేలు" సిగ్గుగా అని "నా పేరును మెచ్చుకుని మురిపించేస్తే సంతోషపడిపోను. నేనిచ్చిన మాట నిలబెట్టు కోవటానికి సహాయపడాలి మీరు." జర గాల్సిన సంగతి గుర్తు చేసింది సుగుణ.

తన ఆంతర్యం గ్రహించేసిందని అర్థం చేసుకున్న అతడు నిజంగానే భార్య పదునైన తెలివికి అబ్బురపడ్డాడు. మనస్ఫూర్తిగా భార్యకు సహాయపడటానికి సంకల్పించుకున్నాడు.

సమయం కనిపెట్టి తల్లిదండ్రులను సుముఖుల్ని చేశాడు.

అతడి తల్లి"దానికీ...దీనికీ సంబంధం ఏమిటి? నీకు నగచేయిస్తే మాత్రం నీ 'గురుదక్షిణ' కోరిక తీర్చుకోవద్దంటామని ఎందుకనుకున్నావ్?" మృదువుగా గదురుకుందామె.

"మీరు ఇష్టపడి నా కోరిక తీర్చటమే నాకాభరణం లాంటిది" అత్తమామలు, భర్తపై గౌరవంతో ఆమె ఉద్విగ్నమై.... గొంతు గద్గదమైంది.

★ ★ ★ ★

సుగుణ భర్త వేసిన పథకం ప్రకారం సుగుణ, భర్త, అత్తమామలు విశ్వనాథం మేష్టారింటికి చేరారు.

'ఒకరినొప్పించక.... తానొవ్వక' అన్న విధంగా ఉండాలని సుగుణభర్త తాపత్రయం. పరిస్థితి చాలా సున్నితమైనది కావటంతో చాలా ఇబ్బందిగా ఉందతనికి కూడాను.

"అసలు సుగుణోళ్ళు ముందుగా ఇంటికి రాకుండా మేష్టరింటికెళ్ళం – ఏంది?.. పైగా రమ్మని నాక్కబురెట్టటమేంది? పంతులుగిని మా రొండు కుటుంబాల మద్దిన తంపెడతండాడా ఏంది?" కబురందుకున్న సింహాద్రి ఆశ్చర్య పడుతూ మేష్టారింటికి వచ్చాడు.

సుగుణ, ఆమె భర్త మేష్టారు దంపతులకి నూతన వస్త్రాలతో బాటు ఒక కవరు కూడా ఇచ్చారు. వారికి నమస్కరిస్తూ సుగుణభర్త –

"మేష్టారూ మీరు మమ్మల్ని అపార్థం చేసుకోవద్దు. ఈ రొక్కం మా మామగారికిచ్చి మీ బాకీ చెల్లించేయండి. మీరు చెల్లించరని కాదు గాని... సుగుణ కోరిక ఇది! ఇది సుగుణ ఇచ్చే గురుదక్షిణ. అంతే...! అంత కంటే మరేం లేదు." అన్నాడు వినయంగా.

విశ్వనాథం మేష్టారు తెల్లబోయి చూస్తుండిపోయారు కొంతసేపు. వెంటనే తేరుకుని సంభాషణకుపక్రమించారు.

మీరు అందరూ కలిసి మా ఇంటికి రావటంలోని ఆంతర్యం ఇదనుకోలేదు. నేనింకొకటి ఊహించుకున్నాను. కాని...! పరిస్థితి చూస్తుంటే నేననుకున్న సంగతి మీకెవరికీ అసలు తెలియదేమో అన్పిస్తోంది. ఇంకా ఆసంగతి దాచిపెడితే తప్పే కాగలదు. పర్యవసానం ఏదైనా సమస్య నుంచి పారి పోవటం సబబు కాదుగదా!" సంకోచిస్తూ ఆపేశారు విశ్వనాథం మేష్టారు.

అందరిమీదా విపరీతమైన కోపం వచ్చేసిన సింహాద్రితో సహా అందరికీ ఒకటే ఆత్రం.... "ఏమిటా సంగతి?.... ఏమై ఉంటుందా విషయం.....?"

"మా సుగుణ పెళ్ళవగానే పక్కా గృహిణైపోయింది. అలా సుగుణ బాధ్యత పెరిగిందిగా మరి! అదేమిటంటే... అది.... ఒట్టి గురుదక్షిణ మాత్రమే కాదు. ఇంకొక దక్షిణ కూడా రావాలి సుగుణ నుంచి నాకు. అదేమిటో తెలుసా?.....వరదక్షిణ ! తన ఆడ పడుచు నా ఇంటి కోడలు కావాలంటే...." అంటూ ఆపేశారాయన.

ఆశ్చర్యంతో అందరూ తలొకమాటా మాట్లాడటం, చర్చించుకోవటం వింటూ విశ్వనాథం మేష్టారే మాట్లాడసాగారు. అందరికీ వివరించసాగారు.

"అవును మీరనుకుంటున్నది నిజమే! మా రమేష్..... మీ మైథిలి ప్రేమించుకున్నారు. పెళ్ళాడాలనుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితమే నాకీ సంగతి తెలిసింది. మీ

క్కూడా ఆ సంగతి తెలిసి నాతో సంప్రదించటానికి అందరూ కలిసివచ్చారను కున్నాను."

"మీది అగ్రకులం గదా మేష్టారూ! ఈ విషయం సంప్రదించగల ధైర్యంమాకెక్కడిది?" సుగుణ భర్త బిడియపడుతూ అన్నాడు.

"సుగుణా ! నేను మీకు చెప్పిన సమసమాజం గురించిన పాఠాలన్నీ ఊరికే బోధనకోసం చెప్పినవి మాత్రమే అనుకున్నావా నువ్వుకూడా?"

"మేష్టారూ...అయితే మా మైథిలిని...." సంభ్రమాశ్చర్యాలతో అడిగింది సుగుణ.

" ఇక ముందు మన మైథిలి....." అంటూ "ప్రేమ కుల, మతాంతరాలకు అతీతమైనదని మనందరికీ తెలుసు. మనమే పూనుకుని వారిని దంపతుల్ని చేద్దాం. మన గౌరవం నిలుపుకుందాం! ఏమంటారు?" అన్నారు.

ఎవరికీ నోటంట మాట రాలేదు. అందరూ అంగీకారంగా తలాడించారు. సుగుణ అత్తమామలు సందేహపు గొణుగుడు విన్న మేష్టారు "వరుడికి వధువే దక్షిణ. మాకు మా కోడలే లాంఛనం. తీరింది కదా మీ సందేహం?" నిండుగా నవ్వుతూ అన్నారు.

"ఎంతడిగినా ఇవ్వాల్సిన స్థితిలో ఉన్న వారి దగ్గర కూడా పంతులు ఒక్కపైసాకూడా వరదక్షిణ అడగలేదు. ఎంతదొడ్డ మనసు పంతులిది?" పశ్చాత్తాపం పొంగింది మనసులో సింహాద్రికి. పూర్వపు తన ప్రవర్తనకి సిగ్గుపడ్డాడు కూడా ! తల్చుకున్న కొద్దీ తన "సన్నబుద్ధి" అవగతమౌతోందతడికి.

"నన్ను సెమించు పంతులూ!....డబ్బు, దర్పమేఁ దొడ్డదనుకున్నాన్నేను. నీ సేయితం సాలు నాకు. ఈ సమ్మందంతో మనం అన్నదమ్ములం అయిపోయినాం. అప్పు సంగతి మర్సిపోదాం!" చెమ్మగిలిన కళ్ళను తుండుతో తుడుచుకున్నాడు సింహాద్రి.

" ఆదర్శం ఉన్నంత మాత్రాన చాలదనీ 'ఆచరణ' చాలా ముఖ్యమనీ నిరూపించారు మేష్టారూ!" అంటున్న సుగుణభర్త విశ్వనాథం మేష్టారియందు కృతజ్ఞతతో తలమునకలైపోయాడు. తన భార్య 'ఈ గురువుకి' అంత భక్తురాలు ఎందుకైందో అవగాహనైంది అతనికి. " నేను కూడా ఇంత మంచి గురువు కావాలి" అనుకున్నాడు.

"మీయమ్మకీ ఇషయాలన్నీ సెప్పాలి గదమ్మా! ఇకెల్దారా?" కూతురితో అన్నాడు సింహాద్రి. అందరూ మేష్టారింటి నుంచి బయల్దేరారు.


## శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానం

### పెదకాకాని గ్రామము, గుంటూరు జిల్లా, ఫోన్: 2556184

**నిత్యాన్నదాన పథకము :** శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము నందు భక్తుల సౌకర్యార్థము నిత్యాన్నదాన పథకము ప్రవేశపెట్టబడినది దీని కొరకు మీరు విరాళముగా రూ. 1,116/–లు ఆపై ఎంత మొత్తమైనను చెల్లించవచ్చును. మీరు ఇచ్చిన విరాళముపై సంవత్సరమునకు వచ్చు వడ్డీతో సంవత్సరములో మీరు కోరుకున్న ఒక్కరోజు ఉచితముగా అన్నదానము చేయబడును.

**నిత్యప్రసాద పథకము :** ఈ పథకమునందు భక్తులు రూ. 1,116/–లు ఆపై ఎంత మొత్తమైనను చెల్లించవచ్చును. మీరు చెల్లించిన విరాళముపై సంవత్సరమునకు వచ్చు వడ్డీతో సంవత్సరములో మీరు కోరిన ఒక్కరోజు ఉచితముగా ప్రసాదము పంచి పెట్టబడును.

**శాశ్వత పూజల పథకము :** ఈ పథకమునందు సంవత్సరమునకు ఒక్కసారి భక్తులు కోరిన రోజున వారి పేరున వారి గోత్రనామాలతో ఈ క్రింద తెలిపిన శాశ్వతపూజలు నిర్వహించబడును.

దేవాలయ గాలి గోపురము



**శాశ్వత పూజలు**

**శాశ్వత అభిషేక పథకము రూ. 1,116/-**

**శాశ్వత అష్టోత్తర పథకము రూ. 1,116/-**

**శాశ్వత కళ్యాణ పథకము రూ. 5,116/-**

**నూతక్కి కోటయ్య**

సహాయకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి